# ఉచితాలు, ప్రజాకర్షక పథకాల పేరుతో వంచనకు పాల్పడుతున్న పాలక పార్టీలు

**ఎన్నికలు** సమీపిస్తున్న తరుణంలో అధికార, విపక్ష పాలక పార్టీలన్నీ రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు తాము అందించబోయే సంక్షేమ పథకాలు, రాయితీలు, ఉచితాలు, సబ్సిడీల గురించి ఒకదానిని మించి మరొకటి పోటీలు పడి మరీ హోరెత్తిస్తున్నాయి. కేంద్రంలో, రాష్ట్రాలలో పాలక పార్టీలన్నీ ఈ పథకాలన్నింటితో కూడిన తమ తమ ఎన్నికల ప్రణాళికలను అట్టహాసంగా విడుదల చేస్తున్నాయి. తమకు అధికార పీఠం కట్టబెడితే రానున్న ఐదేళ్లలో ప్రజల జీవితాలను బంగారుమయం చేస్తామని పూదరగొడుతున్నాయి.

వాస్తవానికి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల సందర్భంగా ప్రతిసారీ జరిగే తంతే ఇది. పాలక పార్టీలు అమలు చేస్తున్న ఈ సంక్షేమ, అభివృద్ధి విధానాలతో ప్రజల వాస్తవ జీవన ప్రమాణాలు ఎంత వరకు మెరుగయ్యాయనే ప్రశ్నకు జవాబు ఇవ్వటానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. ఈ విధంగా సంక్షేమ పథకాలను ఎన్ని దశాబ్దాల కాలం అమలు చేసినా, ప్రజల వాస్తవ జీవనస్థితి గతులలో పురోగతి ఉండదనే విషయం పాలక పార్టీలన్నింటికీ స్పష్టత ఉన్నా, ఎవరూ దాని గురించి పెదవి విప్పరు. ప్రజలను ఈ పథకాల మాయాజాలంలో శాశ్వతంగా బంధించి, తమ దోపిడీ యజమానుల ప్రయోజనాలను నిరాటంకంగా నడుపుకెళ్లడమే వారందరికీ కావలసింది!

1960లలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం, దేశ ప్రజలలో వెల్లువెత్తిన అసంతృప్తి, దేశవ్యాప్తంగా ప్రత్యేకించి నక్సల్‌బరి, శ్రీకాకుళం తదితర ప్రాంతాలలో పెల్లుబికిన ఉద్యమాల నేపథ్యంలో – పాలకులు, భూ సంస్కరణలు, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాలతో ముందుకు వచ్చారు. 'పంచ పాండవులు అంటే మంచం కోళ్లలాగా ముచ్చటగా ఇద్దరు అని చెప్పి, ఒక వేలు చూపించబోయి, సున్నా చుట్టిన చందంగా...' భూ సంస్కరణలు, మిగులు భూముల పంపిణీ కార్యక్రమం డొల్లగా రుజువైంది. భూమిలేని నిరుపేదలకు మిగులు భూములను పంచక పోగా, వారు ఆనాటికే సాగు చేసుకుంటున్న దేవాలయ, పోరంబోకు, ఫారెస్ట్, బంజరు తదితర భూములపై సైతం... ఆ సాగుదారులైన నిరుపేదలకు హక్కు కల్పించకపోవడమే భూ సంస్కరణల బూటకత్వాన్ని వెల్లడి చేసింది. అయితే తదనంతర కాలంలో పాలకులు మాటవరసకు కూడా భూ సంస్కరణలు, భూ పంపిణీల గురించిన ఊసెత్తుకోవడం మానివేశారు.

1980లలో ప్రజలను ఆకర్షించే కొత్త రూపాలతో పాలకులు ముందుకు వచ్చారు. కాలే కడుపుతో ఉన్నవానికి తక్షణం ఆహారం అందించాలంటే 'రెండు రూపాయలకు కిలో బియ్యం', ఉచిత విద్యుత్తు వంటి హామీలతో ప్రజలను ఆకర్షించారు.

1990ల నాటికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలులో భాగంగా ప్రజలకు అందే కొద్దిపాటి రాయితీలను, సంక్షేమాన్ని, సబ్సిడీలను క్రమంగా తగ్గించుకుంటూ, ఎత్తివేస్తూ వచ్చారు. ఆర్థిక మీటలతో రైతాంగాన్ని భూముల నుండి తొలగించి కార్పొరేట్లపరం చేస్తూ, కాంట్రాక్ట్ వ్యవసాయం భారీగా కొనసాగించే విధానాలను చేపట్టారు.

రైతాంగ సంక్షోభం ఈ కాలంలో తీవ్ర రూపం దాల్చింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటి వ్యవసాయ ఉత్పాదకాలు, బహుళజాతి కంపెనీల చేతులలో ఉండి, వాటి ధరలు అనూహ్యంగా పెరిగిపోవడం, పండిన పంటకు సరైన మార్కెట్ సౌకర్యం, కనీస మద్దతు ధరలు లేకపోవడంతో పాటు, అతివృష్టి– అనావృష్టి పరిస్థితులు, సంస్థాగత రుణ సౌకర్యం కొరవడటం, స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధార పడాల్సిరావటం, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం వంటి అనేకానేక కారణాలతో రైతాంగం, ప్రత్యేకించి కౌలు రైతాంగం పీకల లోతు రుణభారంలో కూరుకపోయారు. ముఖ్యంగా సస్య విప్లవం అమలైన ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రైతాంగం బలవన్మరణాలకు పాల్పడ్డారు. వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీయకుండా చేసి, భూమి నుండి రైతులను పరాయీకరించారు. ఇక, వ్యవసాయంపై ఆధారపడిన రైతుకూలీలు, గ్రామీణ పేదలు పొట్ట చేత పట్టుకొని కారుచౌక కార్మికులుగా నిరంతరాయంగా వలసలు పోవడం గ్రామీణ ముఖచిత్రంగా మారింది.

నూతన ఆర్థిక విధానాలతో పారిశ్రామిక రంగం మరింత కుదేలైంది. ప్రభుత్వ రంగ పరిశ్రమల మూసివేత, వ్యవసాయధారిత పరిశ్రమలను మరింత కునారిల్లచేయడం, కార్మికులపై పని భారం పెంపు, హక్కులను కాలరాయడం, కాంట్రాక్టు – క్యాజువల్ – ఔట్ సోర్సింగ్–ఫిక్స్‌డ్ టైం కార్మికులను యజమానులు తమకు అవసరమైనప్పుడు నియమించుకుని తర్వాత తమ చిత్తానుసారం తొలగించి వేసే 'హైర్ అండ్ ఫైర్' విధానాలతో కార్మికలోకం తీవ్ర అసంతృప్తితో అట్టుడికిపోతోంది. వివిధ రూపాల్లో వారి నిరసనాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ నేపథ్యంలో కార్మిక రైతాంగంతో పాటుగా ఇతర సెక్షన్ల ప్రజలందరినీ మోసగించడానికి పాలకులు పాత విధానాలనే సరికొత్త రూపాలలో ముందుకు తెచ్చారు. ప్రజలను ప్రాణాలతో ఉంచి, కారుచౌక కార్మికులుగా వారిని మిగుల్చుకునేందుకు వీలుగా పథకాలను ప్రవేశపెడుతూ వచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈ కోవలేదే! ఈ పథకానికి ప్రతి ఏటా కేటాయించే వేలకోట్ల రూ॥ల బడ్జెట్‌ను దిగువస్థాయి పాలకశ్రేణుల 'ఫలహార' పథకంగా మార్చివేశారు.

అవినీతిలో నిండా మునిగిన పాలకులే, అవినీతిని నిర్మూలించే పేరిట, పేదలకు అందవలసిన లబ్ధిని నేరుగా పేదలకే నగదు రూపంలో అందిస్తామంటూ ముందుకు వచ్చారు. దేశంలో ఏదో మేరకు వ్యాప్తి చెందిన డిజిటల్ సాంకేతికత సహాయంతో లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదును బదిలీచేసే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) విధానాన్ని చేపట్టారు. లాటిన్ అమెరికాతో సహా వివిధ వెనుకబడిన దేశాలలో అమలుపరచి, దోపిడీశక్తుల ప్రయోజనాలకు దోహదపడిన ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలుచేసింది.

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలోనున్న వైఎస్ఆర్‌సిపి తాము ఎన్నికలకు ముందు ప్రకటించిన 'నవరత్నాల 'పథకాలను 98% పైగా అమలు చేశామని, కనుక రానున్న ఎన్నికల్లో భారీ విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తుండగా,' సూపర్ సిక్స్' పేరున తెలుగుదేశం, జనసేనలు బిజెపితో కలిసి ప్రజలకు మరిన్ని వాగ్దానాలు చేస్తున్నాయి. జగన్ పాలన అవినీతి పూరితమైందని, అప్పుల మయమైందని, తాము అధికారంలోకి వస్తే 'సంపదను సృష్టిస్తామ'ని వారు గంభీరంగా మాట్లాడుతున్నారు మినహా, పథకాల పేర్లను అటూ ఇటుగా మార్పులు, చేర్పులు చేసి ప్రకటించడమే జరుగుతోంది. అప్పులమయమైన రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వస్తే ఎలా గాడిన పెడతామనే అంశాన్ని వారేమీ వివరించడం లేదు. జగన్ తీరున తాము ప్రకటిస్తున్న పథకాలకు అయ్యే వ్యయాన్ని లెక్క వేస్తే మరింత ఎక్కువ బడ్జెట్‌నే కేటాయించాల్సి ఉంటుందనే అంశాన్ని దాటవేస్తూ, ప్రజలను వంచనకు గురి చేస్తున్నారు.

వ్యవసాయం, విద్య, వైద్యం, పెన్షన్లు వంటి కొన్ని అంశాలలో రాష్ట్ర పాలకులు చేపట్టిన విధానాలను పరిశీలిద్దాం

వ్యవసాయ రంగంలో జగన్ ప్రభుత్వం... రైతు భరోసా–పిఎం కిసాన్ పథకం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, ఉచిత పంటల భీమా పథకం, సున్నా వడ్డీ పంట రుణాలు, యంత్ర సేవా పథకం, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం... మొదలైనవి అమలు చేశాం అంటున్నారు. రైతులకు అడుగడుగునా నగదు సహాయమందిస్తున్నాం అంటున్న ఈ పాలకులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి పంట ఉత్పాదకాల ధరలను కట్టడి చేయగలుగుతున్నారా? అకాల వర్షం బారినపడి, పంట తడిసి పోతుంటే, దానిపై కప్పటానికి టార్పాలియన్లను, కళ్లాల్లో ధాన్యాన్ని ఎత్తడానికి గోతాలను కూడా సరఫరా చేయని పాలకులు... రైతాంగ సంక్షేమం గురించి మాట్లాడేందుకు అర్హులేనా? చచ్చీ చెడి రైతు పంట పండిస్తే, ఆ పంటకు మద్దతు ధరను అందించి కొనుగోలు చేయకుండా మార్కెట్ శక్తుల, దళారీల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం.. ప్రతి వ్యవసాయ సీజన్లోనూ జరుగుతూ వస్తున్నదే కదా?! కౌలు భారం అదనంగా మోస్తున్న కౌలు రైతులకు, బేషరతుగా కనీసపాటి ఉపశమనాల్ని కూడా అందజేయని పాలకులు.. రైతాంగ ప్రయోజనాలను పరిరక్షిస్తారా?!

వైద్యరంగంలో... ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ పథకం, ఈ–సంజీవిని, ఉచిత టెలి మెడిసిన్, 108 అంబులెన్స్‌లు, కంటి వెలుగు తదితర ఎన్నో పథకాలు అమలు చేశామంటున్నారు. అయినా ప్రజల ఆరోగ్యానికి వెచ్చించే ఖర్చు ఏమైనా తగ్గిందా? తమ సంపాదనలో అత్యధిక భాగాన్ని పేద, మధ్యతరగతి ప్రజానీకం వైద్యానికి ఖర్చు చేస్తున్న పరిస్థితి మన అనుభవంలోనిదే కదా?! వైయస్ రాజశేఖర్‌రెడ్డి మొదలుకొని, ఈనాటి వైసిపి పాలకుల వరకు ఆరోగ్యశ్రీ పద్దు కింద బడా కార్పొరేట్ ఆసుపత్రులకు కట్టబెట్టిన లక్షల కోట్ల రూపాయలను, ప్రభుత్వ ఆసుపత్రుల కోసం వెచ్చిస్తే, ప్రజలకు ఉచిత వైద్యం... ఎంతో మెరుగ్గా లభించి ఉండేది కాదా?!

విద్యారంగంలో రాష్ట్ర పాలకులు... మధ్యాహ్న భోజన పథకం, గోరుముద్ద, అక్షయ పాత్ర, అమ్మ ఒడి, మనబడి నాడు –నేడు, విద్యా కానుక (స్కూల్ కిట్), విద్యా దీవెన (రీ యంబర్స్‌మెంట్), వసతి దీవెన (హాస్టల్ వ్యయం), విదేశీ దీవెన... మొదలైన పథకాలను అమలు చేశామంటున్నారు. దీనిలో ఫీజు రియంబర్స్మెంట్ల పేరున, పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చిన వందలాది బడా, కార్పొరేట్ కాలేజీలకు కట్టబెట్టిన ప్రజాధనంతో, ప్రభుత్వ రంగంలోనే, ఎన్నివందల కళాశాలలు నిర్మించి, నిర్వహించటం సాధ్యమయ్యేదో కదా?! అంతేగాక, ఈ పథకాల అమలులో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, (విద్యార్థులకు ట్యాబ్‌ల కొనుగోళ్ళ పేరుతో బహుళజాతి కంపెనీలకు మార్కెట్‌గా ఆంధ్రప్రదేశ్‌ను మార్చటంలో అవినీతి పార్శ్వాన్ని అలా వుంచినా) ఆంగ్ల భాషలో విద్యా బోధన, పాఠశాలల విలీనం పేరుతో అనేక పాఠశాలల మూసివేత వంటి అనేకానేక అస్తవ్యస్త విధానాలతో, విద్యారంగాన్ని మరింత దిగజార్చారు. విద్యారంగంలో కీలకమైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం పక్కనపెట్టారు. ఉపాధ్యాయులపై ఏకపక్ష దాడి చేస్తూ విద్యారంగంలో సంక్షోభాన్ని సృష్టించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు సాంవత్సరిక బడ్జెట్, లక్ష కోట్ల రూపాయలు కాగా.. విడివడిన తర్వాత నుండి, రెండు రాష్ట్రాలూ లక్షకోట్ల రూపాయల చొప్పున బడ్జెట్ ప్రవేశ పెట్టగలిగాయి! ఈ బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం పెంచుతూపోతూ, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రెండు లక్షల 80 వేల కోట్ల రూపాయలను గత సంవత్సరం బడ్జెట్‌గా ప్రవేశపెట్టింది. కాగా, బటన్ నొక్కి ఈ ఐదు సంవత్సరాలలో నేరుగా వివిధ విభాగాల లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసిన మొత్తం 2 లక్షల 65 వేల కోట్ల రూపాయలు అని లెక్కలు వేస్తున్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కునారిల్లుతుండడంతో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ముఖ్యంగా కరోనావిపత్తులోనూ, తదనంతర కాలంలోనూ అత్యధిక ప్రజల కొనుగోలు శక్తి కనీస స్థాయి కంటే దిగువకు పడిపోయిన నేపథ్యంలో, పెట్టుబడిదారుల మార్కెట్ సరుకుల అమ్మకాలలో ప్రతిష్టంభన ఏర్పడి, తిరిగి అది మాంద్యానికి దోవతీసే పరిస్థితి ఏర్పడుతుంది. అందువలన వారి

సరుకుల అమ్మకాలు కనీస స్థాయిలో జరిగేటందుకైనా ద్రవ్య చలామణి అవసరమవుతుంది. కనుక, వివిధ పథకాల పేర్లతో లబ్ధిదారులకు నేరుగా నగదు చెల్లించటం, వారి వ్యవస్థ మాంద్యంలో చిక్కుబడకుండా వుండేందుకనేది కూడా రూఢీ అవుతోంది.

ప్రభుత్వం, వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దన్నుగా నిలిచి, అవసరమైన పెట్టుబడినందించి, గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజానీకానికి విస్తృతంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలి. అప్పుడే ప్రజలకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది, వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మరోవైపున వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో, అది రాష్ట్ర ఆదాయాన్ని పెంచటానికి, తద్వారా వాస్తవికంగా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల ఆత్మగౌరవ జీవనానికి తోడ్పడుతుంది.

ఈ విధంగా ప్రజలు తమ స్వశక్తితో స్వతంత్రంగా జీవించేందుకు ఇష్టపడని పాలకులు, వారిని నిరంతరం తమను దేబిరించే వారుగా ఉంచాలనే చూస్తున్నారు. అందువలన పైన పేర్కొన్న వివిధ రకాల పథకాలకు (దీనిలో అవినీతి సరే సరి!) లక్షల కోట్లు ఖర్చుపెట్టగలుగు తున్నారు గాని, ఉత్పత్తిని పెంపు చేయడానికి ఆ నిధులను మళ్లించరని స్పష్టమవుతోంది.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, చర్మకారులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, డప్పు కళాకారులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు... ఇలా పెన్షన్లను ఒక 'సామాజిక బాధ్యత' అంటూ వేలకోట్ల రూ॥లు ఈ పథకానికి వెచ్చిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటోంది. పేదల సంక్షేమం, అభివృద్ధిపై ఇంతకాలంగా లక్షల కోట్లు వెచ్చించిన తర్వాత కూడా, 'అమృతకాలం'లోనూ తలకు ఐదు కిలోల చొప్పున అంత్యోదయ పథకం ద్వారా, దేశవ్యాపితంగా 80 కోట్ల మందికి పైగా ప్రజలు ఆహార ధాన్యాల కోసం వేచిచూడాల్సిన దుస్థితిలో ఎందుకు ఉన్నారన్న ప్రశ్నకు వీరి వద్ద సమాధానం లేదు.

మరోవైపున జీవితకాలం ప్రభుత్వ ఉద్యోగంలో సేవలందించి, ఉద్యోగ విరమణ అనంతరం, మిగిలిన జీవితకాలమంతా తమకు, తమ కుటుంబపు జరుగుబాటకు అవసరమైన, న్యాయమైన, ఎన్నో పోరాటాల ద్వారా ఉద్యోగులు – కార్మికులు సాధించుకున్న, పాత పెన్షన్ విధానాన్ని మాత్రం అమలు చేయబోమని భీష్మించడంలోనే ప్రభుత్వ దురుద్దేశం అర్థమవుతోంది. ఒక హక్కుగా డిమాండ్ చేస్తే ఎవరికీ ఏమీ ఇవ్వబోమని, తమ దయాదాక్షిణ్యాల కనుగుణంగా మాత్రమే వ్యవహరిస్తామనటం కాదా ఇది?!

సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం ఖర్చు చేసే మొత్తం వల్లనే దేశాభివృద్ధి కుంటుపడుతోందని, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వెచ్చించలేకపోతున్నారని, కొందరు మేధావులు వాపోతున్నారు. ఇది సరైన వాదన కానే కాదు.

ఆహార, వస్తు ఉత్పత్తి పెరగటానికి దోహద పడకుండా లబ్ధిదారులకు నగదు చెల్లింపులను 'ఉచితాలు' (freebies)గా చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఉచితాలను రద్దు చేయాలా, ఉచితాలతో పేదలంతా సోమరులుగా తయారవుతున్నారా, ఉచితాల కారణంగానే ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతోందా?! ఇవన్నీ... తరచి చూడాల్సిన అంశాలు.

ఈనాడు ప్రభుత్వాలు లబ్ధిదారుల పేరిట ప్రజలను తమ చుట్టూ తిప్పుకుంటూ, డిజిటలీకరణతో ముడిపడిన ఆటంకాల న్నింటినీ వారు అధిగమించిన తర్వాత, అనేక గీటురాళ్లతో వడబోసిన తర్వాత, ప్రభుత్వం విధించిన 300 యూనిట్ల లోపు విద్యుత్తు వాడకం,75% బడికి హాజరు వంటి ఎన్నో నిబంధనలను సంతృప్తి పరచిన తరువాత... అర్హులు ఎంతమంది ఉన్నా, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే, వారు అందించే ఆ కొద్దిపాటి నగదు.. ప్రజల అవసరాలతో పోల్చుకున్నపుడు ఏ మూలకూ రాని మాట వాస్తవం. పెరిగిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, కూరగాయలు ఇతర నిత్యావసరాల ధరలు, రవాణా ఛార్జీల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, చెత్త పన్నుతో సహా వివిధ రకాల పన్ను భారాల పెంపుల నడుమ... ప్రభుత్వం అందించే నగదు ఎందుకూ కొరగాదు. దీనికి తోడు, అనేక పేదల కుటుంబాలలో చేతికి వచ్చిన ఆ డబ్బు కాస్తా తిరిగి ప్రభుత్వ మద్యం దుకాణాలకే చేరుతుండడం వాస్తవం కాదా?! ప్రభుత్వాలు ఇచ్చే ఒకటో, రెండో ఉచితాలతోనే పేదల బ్రతుకులు తెల్లారటం లేదు. పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకొని వారు భవన నిర్మాణ కార్మికులుగానూ, ప్రమాదకర పరిశ్రమల లోను, ఇంకా పలురకాల కారుచౌక కూలీలుగా పని చేయకుంటే, నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్ళవనేది నిజం కాదా?! అందువలన... ఈ పథకాలతో ప్రజలు సోమరులవుతారనే వాదన అర్థం లేనిది.

ఇక ఈ ఉచితాల కారణంగా ఆర్థిక వ్యవస్థకు నష్టమనే వాదన హాస్యాస్పదమైనది. కరోనా విపత్తుతో దేశం యావత్తు విలవిల్లాడుతున్న విపత్కరకాలంలో ఆదాని, అంబానీలు ప్రపంచ కుబేరులలోకి ఎగబాక గలగటం... దేనిని సూచిస్తుంది?! లక్షల కోట్ల ఆత్మ నిర్భరభారత్, పిఎం కేర్స్ నిధులలో సింహ భాగాన్ని దిగమింగినది ఎవరు? అలాగే, దేశంలో బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుండి తీసుకొని ఎగవేసిన లక్షల కోట్లతో పోలిస్తే; బడా, బహుళజాతి పారిశ్రామికవేత్తలకు కల్పించే వేలకోట్ల పన్ను రాయితీలు, నిరర్థక ఆస్తులపేరిట (ఎన్‌పిఏ) వారి లక్షల కోట్ల బకాయిల రద్దులతో పోలిస్తే... పేదలకు ఇస్తున్నాం అంటున్న సంక్షేమం, ఉచితల కేటాయింపు... సముద్రంలో నీటి చుక్కే కదా!

దీనితోపాటుగా ఈ సందర్భంలోనే స్పష్టం చేసుకోవలసిన అంశం మరొకటి ఉంది. ప్రజలపై విధించే వివిధ రకాల పన్నుల రూపంలో ప్రభుత్వం వద్దకు పోగైన డబ్బుని బడ్జెట్ రూపంలో ప్రభుత్వం తిరిగి ఖర్చు పెడుతూ రావడం అందరకూ తెలిసిందే. అయితే ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో 70% పైగా పేద, మధ్యతరగతి ప్రజానీకం నుండే లభిస్తుండగా, సంపన్నుల పన్నుల చెల్లింపులు తక్కువగాను, లబ్ధి పొందటంలో

ప్రధములుగాను ఉండడం… వాస్తవం కాదా?! బడ్జెట్‌ను మొత్తంగా కొల్లగొడుతున్న వీరు, సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి కుంటుపడుతుందని, తాము చెల్లించిన పన్నులతో పేదలకు ఉచితాలు అందిస్తున్నారని పేర్కొనడం… వాస్తవాలను తలకిందులుగా చూపటమే అవుతుంది మినహా, వేరు కాదు.

నిర్బంధం, సంస్కరణలనేవి ఒకే నాణానికి బొమ్మ–బొరుసు లాంటివి. భూమి, ఉద్యోగం, ఉపాధి, గృహవసతి, విద్యా, వైద్యం… వంటి ప్రజల మౌలిక సమస్యలకు దోపిడీ పాలకులు ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపలేరు. ఈ డిమాండ్లపై ప్రజలు వివిధ రూపాల్లో సాగించే ఆందోళనోద్యమాలు తీవ్ర రూపం దాల్చినప్పుడు, ఆ ఉద్యమాలను రక్తపుటేరుల్లో ముంచటానికి కూడా వారు వెనుకాడరని అనేక సందర్భాలలో రుజువైన వాస్తవం. అయితే ఆయుధాలతో, నిర్బంధాలతో, ప్రజలను ఎల్లకాలం అణిచి ఉంచలేమని కూడా వారికి స్పష్టమే. కనుక, ఏకకాలంలో ఒకవైపున నిర్బంధాన్ని, అణిచివేతను ప్రయోగిస్తూనే, మరోవైపున ప్రజలను బుజ్జగించే, మభ్యపుచ్చే అనేక విధానాలను అమలు చేస్తూ వస్తున్నారు. నిర్బంధం, అణచివేతల ద్వారా మాత్రమే గాక (కుల, మత, ప్రాంతీయ, భాషా ద్వేషాలతో ప్రజలను విభజించి పాలించే… గంజాయి, మద్యం, మత్తు మందులతో ముంచెత్తే విధానాలతో పాటుగా) సంస్కరణలు, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను ఎక్కువ కాలం భ్రమల్లో ఉంచి, తమ పాలన సజావుగా సాగించుకోగలమననే ధీమాతో వారు వ్యవహరిస్తున్నారు.

ఈ పథకాలన్నింటినీ పాలక పార్టీలు తమ రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకునేందుకు ముందుకు తేవటంతో పాటు, ప్రజలను వీటి చుట్టూ పరిభ్రమింప చేస్తూ వంచనకు పాల్పడు తున్నాయి. ప్రజలను శ్రమించే తత్వం, సంఘటిత తత్వం, ఆందోళనామార్గాల నుండి దూరం చేసి…ఈ పథకాలనే ఎండమావుల వెంట పరుగులు తీయించేందుకు, తాము విసిరే ఎంగిలి మెతుకుల కోసం ఎల్లకాలం వెంపర్లాడే వారిగా మలుచుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు స్వయం పోషకం కాకూడదు, ఆత్మగౌరవంతో ఎదగకూడదు అన్నది పాలకుల అంతరంగం. సంక్షేమం పేరుతో సాగించే ఈ విధానాలు ప్రజలను భ్రమల్లో ముంచి, వారి వర్గ చైతన్యాన్ని మసకబార్చడం, పాలకుల లక్ష్యం.

కనుక, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం పేరిట ప్రారంభించిన 'సంస్కరణల' నుండి, సామూహిక ప్రయోజనాలకు ఉద్దేశించిన 'సంక్షేమ పథకాల' నుండి, ఈనాటికి విడివిడిగా వ్యక్తులకు లబ్ధి చేకూర్చే, వారి వారి ఖాతాలలో ఎంతో కొంత నగదు జమచేసే ప్రజాకర్షక, తాయిలాల పథకాలుగా, రానున్న ఎన్నికల్లో నెగ్గేందుకు ముందుస్తుగా, చట్టబద్ధంగా ప్రజాధనంతో ఓట్లను కొనుగోలు చేసే పథకాలుగా దిగజారాయని అర్థమవుతుంది.

1871 సంవత్సరంలో కారల్ మార్క్స్ అమెరికా కార్మిక సంఘ నాయకునికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు: "పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడేలా, కార్మిక వర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడేలా కార్మిక వర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా శత్రుపూరితంగా ఉండేలా నేర్పాలి. లేకపోతే కార్మిక వర్గం పాలకవర్గాల చేతిలో ఆట వస్తువుగా మారిపోతుంది" కనుక, ఉచితాలు ప్రజాకర్షక పథకాల ముసుగులో ప్రజా వంచనకు పాల్పడుతున్న పాలక పాలక పార్టీల మోసపూరిత విధానాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, మౌలిక సమస్యల పరిష్కార దిశగా తమ పోరాటాలను ఎక్కుపెట్టాలి.

★★★★★